



# నాకు బ్రతకాలని వుంది

పవని నిర్మల ప్రభావతి



"చాలామంది కెందుకో చచ్చిపోవాలని ఉంటుం దట! కానీ నాకు బ్రతకాలని ఉంది!

ప్లిమత్‌కార్లలో ప్రియురాళ్ల కౌగిళ్లలో, తాగుతూ తూగుతూ, హాయిగా జీవితం ఓ కమ్మని కలగా మత్తుగా గడిపేస్తున్న కొందరు మహారాజుల్ని చూస్తూ, అలాగే ప్రపంచం ఏమై పోతున్నా, ప్రపంచంలోని మానవజాతి ఏమై పోతున్నా, ఏలాటి అనుభూతీ, ఆవేదనా కలగని ప్రాణమున్న శవాల్లా బ్రతకాలని ఉంది నాకు.

కాని, మురిక్కాలవల గట్టున, బుర్ర బద్దలయ్యే ఎండలో, శరీరం చిరిగిపోయే చలిలో, ఎముకల గూడు ల్లాంటి పిల్లల్ని ఎదల్లో దాచుకుని, చాలీచాలని చింకి పాతలతో శరీరాన్ని కప్పుకోలేక, అడుక్కోవటానికి నోరు రాక, పనిపాటలు చేసుకోవటానికి శక్తి లేక, చేసుకుని కూలి తెచ్చినా గింజ పుట్టక, పస్తులతో మాడి, శరీరం కాలి, అభిమానం మసిఅయి, ప్రపంచంలోని దారిద్ర్యానికీ, వేదనకూ ప్రతిబింబంలా ఉండే స్త్రీ పురుషుల్ని చూస్తుంటే వారి హృదయాలలో గూడుకట్టుకుని ఉన్న ఆకలినీ, ఆక్రందననూ, అభిమానాన్నీ ప్రోవు చేసుకుని అందరి బాధా నాలో నింపుకుని, వారి కన్నీరు నా కన్నులలోకి తరలించుకుని, వారి శుష్క పెదవులపై చిన్న దరహాసం వెలిగించి, అది చూస్తూ ఎన్నాళ్లైనా, ఎన్నేళ్లైనా బ్రతకాలని వుంది.

గాంధీ టోపీల క్రింద మొలిచిన కొమ్ముల్నీ, త్యాగపు చిలకపలుకుల క్రింద వేళ్లు తన్నిన స్వార్థాన్నీ, ప్రజా సేవ సాకుతో విస్తరిల్లుతున్న వంచననీ చూస్తూ, ఆ కొమ్ములతో సాగే హింసాకాండనీ, ఆ పలుకులతో కోస్తున్న గొంతుల్నీ, ఆ సేవలో హతమారిపోతున్న మానవత్వాన్నీ ఇంకా, ఇంకా చూచి, వేచి వేచి, కాచికాచి, వడబోసి, ఆ విషాన్ని త్రాగి, జీర్ణించుకొని, మానవత్వం పూర్తిగా మరుగై పోయేనాటివరకూ బ్రతకాలని ఉంది.

రాజకీయ రణరంగాల్నీ, క్షణాని కో రంగు మార్చే పార్టీలనీ, తలవెంట్రుకలన్ని ఎత్తుల్నీ, పై ఎత్తుల్నీ చూస్తూ, చేసేదిలేక ఆ రాజకీయాగ్నిగుండాలలో పడి, మాడి, మసిఅయి, నామరూపాలు లేకుండా పోతున్న ఎందరో అభాగినుల అమాయకత్వానికి జాలి పడుతూ, సానుభూతి చూపిస్తూ, సాంత్వన యిస్తూ, ఇలా మసిఅయిన వారి బూడిదలోంచే ఒకానొకనాడు జాజ్వల్యమానమైన దివ్య దీపశిఖ ఒకటి ఉదయించి ఈ ఎత్తుల్నీ, పైఎత్తుల్నీ తుడిచిపెట్టేస్తుందన్న కమ్మటి కలల్లోనే బ్రతుకుచేదును మరిచిపోతూ బ్రతకాలని ఉంది!

చెట్టుచాటునో, పుట్టచాటునో కని పారేసి, అనాథ శరణాలయాల్లోనో, మరెక్కడనో నికృష్టంగా పెరుగుతున్న లక్షలాది అనాథల్ని హృదయానికి హత్తుకుని,



